


ఆయనేదో చెప్పాలనుకుంటున్నారు. కాని నాకు వినాలని లేదు. ఏం చెప్పినా నా మనసును బాధించేదేనని అనుభవైక వేద్యం. నన్ను ఏడిపించడం — ముచ్చటగా ఆటపట్టించడం కాదు—ఆయనకు యెంతో యిష్టం—ఏనాడో యెవరికో అపచారంచేసి పాపం ఒడిగట్టుకున్నానో ఈ రకమైన నరకం అనుభవిస్తున్నాను. ఎన్ని పుస్తకాలు చదివినా, యెంత ఆలోచించినా, ఎంతమంది మహానుభావుల మాటలు విన్నా—మన సంస్కార సారం—పూర్వజన్మ కర్మఫలం—ఇదే సత్యంగా, ఇదే నిత్యంగా కనిపిస్తుంది.

పొద్దున్ననుంచి రాత్రివరకు ఉద్యోగం—ఆ తరవాత ఇంటిపని బాధ్యత—అలసట. నిరాశ.

ఆయన భోజనం అయిపోయింది. బయట కడుపు నింపుకుని వచ్చిన మనిషికి ఇంటిలో తిండి విధాయకంకోసమే-రుచికోసమూ కాదు, అవసరంకోసమూ కాదు.

ఉస్సురుమంటూ లేచి కంచం తీసి కడిగే చోట పడేసి టేబిలు తుడిచి చేతులు కడుక్కున్నాను.

వక్కపొడిడబ్బా టీపాయ్‌మీద ఉంచాను.

ఆయన సోఫాలో జేరబడ్డారు. ఆయన చెప్పబోయేది దేనిగురించై ఉంటుందా అని ఆలోచిస్తున్నాను—

మా అక్క ఎయిర్‌హోస్టెస్‌గా ఉందనో, తమ్ముడు శానిటరీ ఇంజనీరుగా ఉన్నాడనో మా నాన్నగారు మలేరియా ఆఫీసర్ అనో ఆట పట్టించే మనిషి—మా పెళ్ళినాటికి ఇలా లేరు. నేనంటే, నా వాళ్ళంటే ఆయన కెందుకంత చులకన!

నా డబ్బు ఆయన అవసరాలకి కాదు—విలాసాలకి పనికి వస్తుంది. నేనూ పనికి వస్తాను, పనిమనిషి మేరకు—ఇంటి కాపలా మేరకు—ఎందుకూ కొరగానిదాన్ని. నాకు భగవంతుడు మనసెందుకిచ్చాడో—మనసులోకి మేకులు దిగవుకదా అని అలా మేకులు కొడుతూ ఉండడం కొందరికి సరదా.

"నాకు అలసటగా ఉంది. వెళ్ళి పడుకుంటా."

ఆయన వక్కపొడి నములుతూ సోఫాలో వెనక్కి జారగిలబడి చెప్పడం ప్రారంభించారు.

"సుజా! ఈ రోజు మనకు బాగా తెలిసినాయన ఒకరు ఆస్పత్రికి వచ్చారు. అంతే కాదు, నన్ను వెదుక్కుంటూ... "

"ఎవరండీ?"

క్షణికంగా ఆయన వేసిన సస్పెన్స్ మోటిఫ్ వలలో పడ్డాను.

"మీ రాఘవరావ్ మాష్టారు."

మొదటి వాక్యానికీ, రెండోవాక్యానికీ ఎంత తేడా!

రాఘవరావ్ మాష్టారు చేసిన మహాపరాధం ఏమిటంటేనన్ను కన్నకూతురులాచూసుకోడం. వల్లమాలిన అభిమానాన్ని ప్రదర్శించడం—ఇదే ఆయనకు కనపడింది. కాని మాష్టారు మాష్టారుకాదు—దేవుడు. తన దగ్గర చదువుకుంటున్న పిల్లలందరినీ అంత అభిమానంగానూ చూసుకోగలగడం ఆయన ప్రత్యేకత. అంతకంటే ముఖ్యమైనది వెకిలిచేష్టలు చేసే వాళ్ళను ఆయన అదుపులో ఉంచే తీరు. అందులో బాగుగా రవికి ఆయనపెట్టే చీవాట్లు—ఎనభై మంది క్లాసులో తలవిరుసు వదిలేటట్టు చేసే సున్నితమైన మర్దనా—

"మాష్టారొచ్చారా! ఎన్నాళ్ళయిందో ఆయనను చూసి, నా గురించి అడిగారా? మన ఇంటికి రమ్మనకపోయారా?"

"ఇంటికి రమ్మననూ లేదు, ఇంటి ఎడ్రసు వరకూ రానివ్వనూలేదు. ఆయన విధుల నిర్వహణలో ఉపన్యాసా లిచ్చేవాడే—అలాగే నేనూ నా విధి నిర్వహణలో నిమగ్నమైపోయాను. అంతమంది పేషెంట్లమధ్యలో, ఓపీలో ఆయనతోనే కబుర్లుచెబుతూ కూచోడం ఎలా సాధ్యం?"

"ఎంత ఓపీ అయితే మాత్రం పక్క క్యాబిన్‌లో రెండు క్షణాలు—పాపం, మీమీద ఎంత ఆశతో, అభిమానంతో వచ్చారో... "

"అభిమానం—కాదు అవసరం."

"అవసరమూ కావచ్చు. అవసరమైతే మన మేనా డాక్టర్లం—ఎంతోమంది ఉన్నారు. మీ దగ్గరకే—మీరన్నట్టు వెదుక్కుంటూ వచ్చారంటే మీమీద ప్రత్యేకం ఉండే అభిమానం, లేకపోతే గౌరవం—లేదా నమ్మకం—అని ఎందుకనుకోకూడదూ?"

"అలా ఎందుకనుకోవాలి? ఆయన మాటలకూ, చేష్టలకూ, వల్లించే ఆదర్శాలకూ, అనుసరించే మార్గాలకు పొంతన కుదరకపోడానికి మంచి ఎగ్జామ్‌పుల్ మీ మాష్టారు.. "

"మా . కాదు. 'మన'. ఆయన లాంటి మనిషిరేమ. ఆయనదగ్గర చదువుకున్నాం. మన చేతులలో ఆయన అవసరానికి ఏమి చెయ్యగలిగినా "

"అవునవును, యివన్నీ నాకూ తెలుసు, కాని ."

"కాని?"

"ఆయన యెట్లాంటి ఆదర్శాలు చెప్పేవారో జ్ఞాపకం ఉందా?"

"లేకేం. ఆయన చెప్పిన పాఠాలు నాకు జ్ఞాపకం లేకపోవచ్చు. మనిషిగా ఆయన బోధించిన నీతులు, జీవితాంతం నాలో జీర్ణించుకుపోయి నాకు వ్యక్తిత్వాన్నిచ్చాయి. అవి నాలో ఓ భాగం అయిపోయాయి ఇంతకీ ఆయన వచ్చిందెందుకట? అంతా కులాసాయేనా?"

"దాని సంగతి తరువాత చెబుతాను. హోల్డేస్

(వి) చిత్ర విజ్ఞానం



## అందరిలో బీరుంది !

చిన్నప్రేవుల్లో రోజూ మనం పుచ్చుకున్న ఆహారంలోని చక్కెరలనుండి "ఎతనాల్" తయారవుతుంది. "బీరు"లోని ముఖ్యమయిన పదార్థం "ఎతనాల్." జీర్ణకోశంలో దీని ఉత్పత్తిని కనిపెట్టింది సర్ హాన్స్ క్రెబ్స్! కాలేయంలోని కొన్ని ఎంజైములు యీ "ఎతనాల్"కు విరుగుడుగా పనిచేసి అది మత్తును కలిగించకుండా చేస్తాయి!

---

హారం ఒకటి చెప్పారు మనకి గుర్తుందా?

"గుర్తు లేకేం వుంది. హాల్డేన్ మహామనీషి. శాస్త్రవేత్త. ఆయన త్యాగం గొప్పది. ఇంగ్లండు దేశంలోపుట్టి భారత దేశానికివచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు. భారత ప్రజల్లో ప్రజల మనసుల్లో, శాస్త్రీయ దృక్పథం ఆయన ఊపిరి. భారతీయులంటే ఆయనకు యెంత ప్రేమానురాగాలో ఆయన కడపటి కోరికే తెలుపుతుంది. శాస్త్రీయ దృక్పథం కాచి వడపోసి నరనరాల్లో జీర్ణింప చేసుకున్న మనిషి మమతకోసం, శాస్త్రదృక్పథంతోనే తన భౌతిక కాయాన్ని ఓ చిన్న కానుకగా వైద్య విద్యార్థుల కంకితం చేసిన మనిషి హాల్డేన్. శాస్త్రజ్ఞుడిగా ప్రపంచ ఖ్యాతిని సంపాదించడం ఒకయెత్తు. మనిషిగా ఆయన త్యాగం మరొక యెత్తు. .."

"అదంతా నాకు ఆయన్ను చూడగానే గుర్తొచ్చింది. కబుర్లు చెప్పడం తేలికే. కబుర్లు చెప్పే మనుషులు, వ్యక్తులుగా తాము బోధించిన ఆదర్శాలు మరిచిపోతారు."

"మేష్టారేం చేశారు?''

"ఏముంది? ఆయనకొక ఆపరేషన్ చెయ్యాలన్నారట అక్కడ డాక్టర్లు. అవసరమొచ్చేసరికి నేను జ్ఞాపకం వచ్చాను. నాపేరు వాకబు చేస్తూ వచ్చేశారు. ఆయనకు ఆపరేషన్ నేనే చెయ్యాలిట. ఆయనకు చాలా భయమట.''

"అందులో ఆదర్శాలకీ ఆయన అడిగిన దానికీ మధ్య వైరుధ్యం ఏముంది?''

"ఆయనకు ఆపరేషన్ నేనే యెందుకు చెయ్యాలి? . . . నలుగురు పిల్లలు, భార్య . . . రెక్కాడితేకాని డొక్కాడనిబ్రతుకులు.. ఆపరేషన్‌లో . "

"పోనీ చేయించుకోడం మానేస్తే. ''

"డాక్టర్‌గా నువ్ అడగవలసిన ప్రశ్నేనా?''

"ఎంతోమంది తెలిసీ తెలియని మనుషులు-కేవలం అజ్ఞానంతో, భయంతో ఎన్నోజబ్బులు ఇముడ్చుకుంటారు బయటకు చెప్పకుండా. . పోనీ ఆయన అంతగా అడుగుతుంటే మీరే చెయ్యరాదూ!''

"అది సింపుల్ థింగ్. సాధారణంగా హౌస్ సర్జన్స్ చేసేది. ఇంతకీ అందరూ ఛీఫ్‌చేతే చేయించుకోవాలంటే మరి వైద్య విద్యార్థులు నేర్చుకోవడం యెలా? అందుకూ నాకు వళ్ళు మండింది. హాల్డేన్ అంత త్యాగంచేస్తే ఆయనను కొనియాడిన మీ గురువుగారు యింత కంగారు పడడం - తనదాకా వస్తేకాని బాధ తెలియదనడానికి నిదర్శనం . ఇంతకీ చెయ్యడం

చెయ్యకపోవడం విషయంలో నాకు ప్రత్యేక మయిన అభిప్రాయంలేదు. అప్పటి పరిస్థితు లనుబట్టి, ఓ అసిస్టెంటో, హౌస్‌సర్జనో, ఎవరో ఒకరు చేస్తారు .నా ఉద్దేశం నీకుబోధ పడిందా? ఆయన నిజస్వరూపం నీకు తెలి సిందా?''

"తెలిసింది. కాని మీరనుకుంటున్న దుస్స్వ రూపంకాదు ఆయన ఎక్కడుంటున్నారో మీకు తెలుసా?''

"ఔట్ పేషెంట్లు ఎడ్రసులు తీసుకునే అల వాటు నాకు లేదు.''

"మనిషికి ఎన్ని చెడ్డ అలవాట్లున్నా కొంత యినా మంచీ, మమకారం ఉంటాయనుకొని నేనే పొరబడ్డాను. ''

—సోఫాలోంచి లేచి మంచంమీద పడు కుని పుస్తకంవంక చూస్తున్న సుజాతకి పుస్తకం లోని విషయం మనసు కెక్కడంలేదు.

రాఘవరావ్ మాష్టారే జ్ఞాపకం వస్తున్నారు. ఆయన అందరినీ ఏమోయ్ అనీ, అమ్మాయ్ అని పిలిచేవారు. ఏకవచనమూ వాడేవారు. చిన్నమ్మా లెక్చరర్లందరూ 'ఏమండీ' అని వాళ్ళ కంటే చిన్నవాళ్ళను పిలుస్తుంటే యెబ్బెట్టుగా ఉండేది. ఆయన ముఖంలోకళ—మాటలలో తేట—పిల్లలందరూ, ఆకతాయి వాళ్ళుకూడా జాగ్రత్తగా పాఠం వినేవాళ్ళు. ఆయన పాఠం చెప్పటంలో ఓ ప్రత్యేకమయిన తీరు పిల్లలం దరినీ ఆకట్టుకునేది. తేలికగా వుండే పదాలూ, వివరణలో ఓపికా—ముఠక విషయాలు చర్చ కొచ్చినా సున్నితంగా వాటిగురించి మాటాడిడం- ఎప్పుడూ చిరునవ్వు—ఎంతో ఉత్సాహం— రాలుగాయి పెంకిఘనంచేసే కొమ్ములు తిరిగిన మొనగాళ్ళకు కూడా ఆయనంటే గౌరవం. భయం. కారణం ఆయన తనకేదో పవర్ వున్నట్టు చెలాయించడానికి ప్రయత్నించక పోవడమే.


ఓ రోజు సుజాతా వాళ్ళ నాన్నగారు మేష్టారు యింటికి వెళ్ళారు.

"డాక్టరుగారూ, మేమెంతటి వాళ్ళం. కేవలం బడి పంతుళ్ళం. మాకు అన్న విశ్వాసమే కాని అహంకారం ఉండటానికి వీల్లేదు. పిల్లవాళ్ళు, అందులో ఈ రోజుల్లో, ఆకతాయిగా తిరగటానికి కారణం వక్తు వాళ్ళేకారు. తలిదండ్రులూ, గురు వులూ, సహాధ్యాయులూ, అందరూ కారకులే. వాతావరణం పూర్తిగా మారిపోయింది. వాళ్ళను మెల్లగా మంచిమాటలతో లొంగదియ్యగలమే గాని, ఏమాత్రం ఒత్తిడికో, బలప్రయోగానికో పాల్పడ్డామో అదానే అవుతుంది చివరకు— ఇంతకూ మాష్టర్లకు కావలసింది ఓర్మి. అవ గాహన శక్తి. కేవలం డిగ్రీలు చాలవు. డబ్బు పవరూ కావాలనుకుంటే ఈ వృత్తిలోనికి రానే కూడదు ఇవన్నీ ఏదో ప్రసంగవశాత్తూ చెబు తున్నా మీ అమ్మాయికేం ఆణిముత్యం. పెద్ద డాక్టరయి మీపేరు నిలబెడుతుంది ఏమమ్మా నామాట నిలబెడతావ్ కదూ! నీకు ఎప్పుడు ఏది కావలసినా అడుగు. నేను చెయ్య గలిగింది సాయం చేస్తా నేనూ ఫిజిక్సూ, కెమిస్ట్రీచదువుకున్నాఇంగ్లీషుమాష్టరికి కెమిస్ట్రీ రాదనుకునేవ్ ఇంగ్లీషుమాత్రం జాగ్రత్తగా చదువుకో అమ్మాయ్. కేవలం పాసైతే చాలదు. ముందు ముందు నీ చదువంతా ఇంగ్లీషులోనే ఉంటుంది. ఇప్పుడు జాగ్రత్తగా నేర్చుకొని అలవాటు చేసుకోకపోతే తరవాత యిబ్బంది ఈమాట కనీసం బయటకి అనడానికి వీలులేని రోజులు వచ్చేటట్టు కనబడుతుంది దీనికోసం డాక్టరుగారూ, మీరు శ్రమ తీసుకు రావాలా? అవతల ఎంతమంది మీకోసం యెదురుచూస్తూ వుంటారో ''

ఈ మాటలు సుజాత ఎప్పుడూ మరచిపోదు. రవికిమాత్రం రాఘవరావ్ మేష్టారంటే ఓ రకమైన యిది—అదే ద్వేషం. అతను ఆక తాయిగా తిరుగుతున్న రోజుల్లో అతని అహంకా రాన్ని అణచడానికి సున్నితంగా ప్రయత్నంచేసి గెలవడం, మేష్టారుచేసిన నేరం. ఎంతమంది లోనో దీపాన్ని వెలిగించిన మేష్టారు రవికి మాత్రం పరమశత్రువే అయ్యారు.

రవి చాలుపడి డాక్టరైపోయాడనే తెలుసు కాని మాష్టారికి ఇంకేం తెలియదు. నిర్మలమైన మనసులో—తన దగ్గర చదువుకొని పెద్దాసు

## (వి)చిత్ర విజ్ఞానం



దొంగ నోటినుండి నిజం బయటకి కక్కించడం పోలీసులకంత తేలికయిన పనికాదు. విదేశాలలో నిజం కక్కించే మందులు రెండు కనుగొన్నారు. ఒకదానిపేరు సోడియం పెంటోతాల్. మరొకటి టాక్సిఫ్లెక్సిల్! ఈ రెండింటిని ప్రయోగిస్తే నిజాన్ని ఎంత దాచుదామన్నా వీలుకాదట! ఇది నిజం!!

పత్రిలో వుద్యోగం నిర్వహిస్తున్న వైద్యుడు కదా అనిపిస్తే రవి ముభావంగా వుండడం ఆయనకెంత బాధ కలిగించిందో!

—మరునటిరోజు సుజాత ఆస్పత్రికి వెళ్ళడంతోనే సర్జికల్ వార్డులన్నిటికివెళ్ళి ఆపరేషన్ షెడ్యూల్స్ చూసింది. ఎస్. వన్‌లో రాఘవరావ్ మేష్టారి పేరుంది. ఆపరేషన్‌కు వారం రోజులు టైముంది. ఈలోగా ఆయనను ఓసారి చూసి ఆయనకు ధైర్యం చెప్పాలని ఆయన ఇంటి ఎడ్రసుకూ, కాలేజీ ఎడ్రసుకూ రెండు ఉత్తరాలు రాసింది తమ ఇంటికి ఆహ్వానిస్తూ.

మాష్టారు రానే వచ్చారు.

"అమ్మాయ్! నీ ఉత్తరం చూసి చాలా సంతోషించాను. మా ఆవిడయితేనా 'ఏమిటీ గాజు బొమ్మల్లే ఇంతవుండేది. అంత డాక్టరై పోయిందా' అంటూ పొంగిపోయింది. చాలా సంతోషమమ్మా. రవి దగ్గరనుంచి నీ దగ్గరకు రావాలని అనుకున్నాను ఆరోజు. కాని రవిని చూశాక ఎందుకో ఇంటికొస్తే కసిరేస్తాడనిపించింది. నేనే పొరబడ్డానేమో! రవి ఏడమ్మా!"

"వస్తారు మాష్టారూ—రాత్రివాలా పొద్దుపోతుంది ఆయన వచ్చేసరికి. ఆయనకు ఎన్నో వ్యాపకాలు."

"అవునమ్మా, అర్థం చేసుకోగలను"

"దేవుడి దయవల్ల ఆపరేషన్ ఒడ్డెక్కిపోతే మరలా ప్రజల్లో పడ్డట్టే. నీ వుత్తరం నాకు ఎక్కడలేని ధైర్యాన్ని యిచ్చింది. నాకిక భయంలేదు. ధైర్యంగా వుంటాను. రవి భావమూ నాకు అర్థమయింది. పదిమంది ప్రజల్లోనూ నేనూ ఒకడిని. ప్రత్యేకంగా నాకు ఏమనా కావలిస్తే డబ్బు ఖర్చుచేసి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలి. అంతడబ్బు లేనివాడిని కాబట్టి నలుగురితోపాటు జనరల్ వార్డులోనే ఉండదలచుకున్నాను. ఇంతకీ నాసొదే వెళ్ళబోసుకున్నాను పిల్లలేరమ్మా?"

"అంత అదృష్టం చేసుకోలేదు మాష్టారూ! ఉన్నదానితో తృప్తిచెందడం నేర్చుకోవడం ఎంతో శ్రేయస్కరమని మీరన్నమాటలు నేను ఎప్పుడూ మరిచిపోను. దేనికయినా పూర్వజన్మ సుకృతమంటూ ఒకటి వుండాలనే నా నమ్మకం. ....విచారించి లాభంలేదు మాష్టారూ, తిలలు నాటి వడ్లు పండాలంటే ఎలా?"

"ఎంత వేదాంతిలా మాటాడుతున్నావ్ తల్లీ నిరాశ చెందడం మానవులకు తగదు. భగవంతుడు నీకు మేలు చేస్తాడు.. రవిని అడిగానని చెప్పమ్మా! ఎంతో ఆప్యాయంగా మాటాడావ్ అంతేచాలు మరి నే వస్తానమ్మా, రేపు ఆపరేషనట. పెద్దబ్బాయి వచ్చాడు నాతోపాటు ఆస్పత్రిలో నాకు సాయంగా వుండటానికి. వాడిని నువ్ చూశావుకదూ."

"శంకర్ కదూ మాష్టారూ. గుర్తులేకేం"

మాష్టారు వెళ్ళిపోయారు.

రాత్రి పదకొండు గంటలకు రవివచ్చి తూలుతూవెళ్ళి నిద్రపోయాడు. సుజాత నిట్టూర్చింది.

తెల్లవారింది. రవి యాంత్రిక జీవితం మొదలయింది.

సుజాతకి డ్యూటీకి వెళ్ళడానికి మనస్కరించలేదు. ఓ సెలవుచీటి రాసి ఆస్పత్రికి పంపేసింది. మరో అరగంటకు తనూ బయలుదేరింది.

వార్డులో బెడ్ మీద మాష్టారులేరు.

వడివడిగా థియేటర్ వంక పరిగెట్టింది. బయట బెంచీమీద శంకర్! "నమస్కారం. డాక్టర్ సుజాతగారంటే మీరేననుకుంటాను... నాన్నగారు మీరువస్తారని ఇంతవరకూ చూశారు. ఇప్పుడే లోపలకు తీసుకువెళ్ళారు .. మీకీ ఉత్తరం ఇమ్మన్నారు...."

అంటూ సుజాతకొక కవరు అందించాడు.

కవరు బ్యాగులో వేసుకుని డ్రెస్సింగ్ రూంలోకి పరిగెత్తింది సుజాత. థియేటర్లో టేబిల్ మీద మత్తులో వున్నారు మాష్టారు. సర్జరీ ప్రొఫెసర్, రవి, పి.జీలూ, హౌస్ సర్జన్లూ అంతా వున్నారు చుట్టూ.

"గుడ్ మార్నింగ్ డాక్టర్!"

సర్జరీ ప్రొఫెసర్ సుజాతవంక చూశాడు.

"ఆయన మా మాష్టారు...." గొంతు బొంగురుపోయింది సుజాతకి.

"ఏం కంగారు లేదమ్మా, నాకన్నీ తెలుసు. నువు గేలరీలో కూచో... జస్టు టెన్ మినిట్స్."

హుందాగా ప్రొఫెసర్ మాస్క్ మీదకు లాక్కున్నాడు. రవి దూరంగా నుంచున్నాడు.

"బి. పీ వన్ సెవెన్ టీ బై నైన్ టీఫై . పల్స్.. వన్ టెన్ .."

కలలో వినపడుతున్నట్టున్నయ్ థియేటర్ లోని మాటలు. సుజాతకు చెమట పట్టింది. తనకు మళ్ళీ తెలివి వచ్చేసరికి ఓ బెడ్ మీద వుంది.

రవి తనవంక ఆత్రంగా చూస్తున్నాడు.

"అంత సెంటిమెంటల్‌గా అయిపోయి, నెర్వస్ అయిపోతే ఎలా, రోజూ చేసే పనే కదా" విసుక్కున్నాడు.

"యూ కీప్ క్వయట్ యండ్ ఫ్రెండ్— షి ఈజ్ ఎ పేషెంట్ నౌ" సర్జరీ ప్రొఫెసర్ రవిని సున్నితంగా మందలించాడు.

రవి తల వంచుకున్నాడు.

"మనం ముందు మనుషులం, తర్వాత డాక్టర్లం. వ్యాధినివారణ ఎంత బాధ్యతో, అవసరమైనప్పుడు పేషెంటుకు ఆత్మస్థైర్యం ఇవ్వడం కూడా అంత బాధ్యతే! .. మీ మాష్టరు హాయిగా వున్నారు. ఆపరేషన్ అయిపోయి



చాలా సేపయ్యింది. నువ్వు లేవగలగ్గానే వెళ్ళి చూడు ..ఆయనకూ ఈసరికి తెలివి వచ్చి ఉంటుంది."

—ప్రొఫెసర్ వెనకాలే రవి వెళ్ళిపోయాడు.

సిస్టర్ 'కాసేపు విశ్రాంతి తీసుకోండమ్మా' అంటున్నా సుజాత లేచి మాష్టరి బెడ్ దగ్గరకు వెళ్ళింది.

"మాష్టారూ!"

"వచ్చావా తల్లీ! నే రాసిన ఉత్తరం చదివావా?"

"లేదు మాష్టారూ తరువాత చూస్తా . ఏమైనా బాధగా వుందా?"

"లేదమ్మా. పాపం నీ కోసం ఎంతమంది పేషెంట్లు కాసుకుని కూచున్నారో వెళ్ళి రామ్మా .వీలయాక నేను యింటికొస్తా!"

—సుజాత డ్రెసింగ్ రూమ్‌లో బ్యాగ్ తీసుకుని నేరుగా వార్డుకు వెళ్ళిపోయింది. మరో అసిస్టెంటుకీ పి. జీకి కాసేపట్లో వస్తానని తన గదిలోకి వెళ్ళి కవరు చింపింది.

చిరంజీవి సౌభాగ్యవతి సుజాతకి

ఎందుకో చాలా భయంగా వుంది. సర్జరీ ప్రొఫెసర్ ఒకప్పుడు మన కాలేజీలో చదువుకున్నవాడేనని తెలిసి ఆయన దగ్గరకు వెళ్ళాను. చాలా మంచివాడు ఎంతో ధైర్యం చెప్పాడు.

అయినా మనసులో ఏదో బెంగ.

ఒకదానికొకటయితే ఇందులో జతచేసిన ఉత్తరాన్ని సూపర్నెంటుకియ్యి. మీ ఆంటీకి చేతనైన ధైర్యం చెప్పు.—రాఘవరావ్

ఆత్రంగా రెండో ఉత్తరం విప్పుతోంది. ఇంతట్లో రవి వచ్చాడు.

"ఎలావుంది?"

"మాష్టారు కులాసాగా వున్నారు."

"ఆయన్ను గురించికాదు నేనడిగింది ..."

"నేనూ బాగానేవున్నా"

"ఏమిటా ఉత్తరం"—రవి తీసుకుని చూసి "సిల్లీ-సూపర్నెంటుకు-ఒకవేళ తను చనిపోతే తన దేహాన్ని వైద్యవిద్యార్థులకిమ్మని—ఈయనకు నిజంగా ఆదర్శాలున్నాయనుకో లేదు ..

ఆవేశంగా లేచిన సుజాత అంది.

"మాష్టారు ఓ దీపం—ఆ దీపం కొడిగట్టదు—" □

# అర్ధరాత్రి నగరం

రోడ్డుమీద నిలుచుని చూస్తే,
కరెంటు తీగలకి తగులుకున్న
గాలిపటంలా వున్నాడు చంద్రుడు
మేఘాల జెండాలను
ఊపేస్తోంది
ఊరిమీంచి లేచిన గాలి
ఏ యుద్ధభూమినుంచి
తిరిగివచ్చిందో,
క్షతనక్షత్రాలనుంచి ధారాపాతంగా
కాంతిని స్రవిస్తోంది ఆకాశం
ఎవరి చిరబాధా జీవితం
కాలి మసైతే
యేర్పడిందో ఈ చీకటి,
గుడ్డిదీపాల కళ్ళలోకి
గుచ్చి గుచ్చి చూస్తోంది.
రిక్షా చక్రం చువ్వల మధ్య
చిక్కుబడిపోయింది
వీధి లాంతరు వెలుతురు,
అర్ధరాత్రి
రోడ్డుమీద నిలుచుని చూస్తే,
వివిధ దృశ్యాలు చిత్రించబడిన
విశాలమైన కేన్వాసులా వుంది నగరం.

—దేవిప్రియ